
# వాళ్ళు ఇద్దరు— రాధ ఒకర్తె

పి. ఎస్. నారాయణ



“ఏఁవే, అమ్మా! మీ ఆయన గూడా వస్తాడేమో ఈ పెళ్ళికి?” చేస్తున్న పనల్లా ఆపి తల్లి మొఖంలోకి చూస్తూ ఫక్కున నవ్వింది రాధ.

సూట్కేసు సద్దుతున్నదల్లా అర్థాట్టుగా తలెత్తింది జానకి.

“ఏవిఁటే అంటావ్?”

రాధ మళ్ళా నవ్వింది: “మీ ఆయన గూడా వస్తాడేమో అంటున్నాను!”

జానకి చిన్నగా నవ్వింది: “రానీయ్... వస్తే మనకేం.... అయినా నీవూ మీ నాన్నను ఇంత వరకూ చూళ్ళేదు అంటున్నావుగదా...చూద్దువుగాని!” చిన్నగా నవ్వుతూ అనసయితే అన్నది గాని అలా అంటున్నప్పుడు గుండెబరువెక్కింది.

నిజమే! తను ఆలోచించలేదు—ఆయన మాత్రం ఎందుకు రాకుండా వుంటారు... ఆ కుటుంబంతో తన స్నేహానికి కారణం ఆయన కాదూ?

మనస్సు మరుభూమయి రోదిస్తున్నట్లుగా వున్నది. తన జీవితంలోని వెలుగును మ్రింగిన చీకటి నరాలను పట్టుకు లాగుతోంది. తనది ఒంటరి బ్రతుకు. తనది ఒంటరి జీవితం.

“ఏవేఁ అమ్మా! ఏవిఁటి ఆలోచిస్తున్నావ్.. వెళ్దామా, వద్దా?”

జానకి ఉలిక్కిపడింది.

"ఆఁ....ఆఁ.." అన్నది.

ఆమె తడబాటుకు రాధకు నవ్వాగలేదు.

"అయిపోయింది.... అంతా అయిపోయింది. ఇక నీ మనస్సును ఎవ్వరూ పట్టుకోలేరు....ఆయన అవతారం నీ కళ్ళముందు నాట్యం చేస్తోంది...ఇంకా కొద్ది క్షణాలువుంటే ఆయన నీకు చేసిన అన్యాయానికి గానూ నీ రెండు కళ్ళూ ఒక పెద్ద నీటికుండకు రెండు చిల్లులవుతయి...." రాధ బరువుగా నవ్వింది.

"మానవత్వంలేని మనుష్యులను గురించి పదే పదే ఆలోచించటం, బాధపడటం, కన్నీరు కార్చటం .... వృథాప్రయాస అమ్మా!.... శుష్కదండగ...."

జానకి కళ్ళకు నీటితెరలు క్రమ్మి వేసినయి.

తాను చిన్నప్పుడు ఊహించుకున్న జీవితానికి-ఈనాడు గడుపుతున్న స్కూలు టీచరు జీవితానికి ఏమైనా సారూప్యమున్నదా?

ఊఁహూఁ....

## 2

రైలుపోతుండగా మరోసారి హెచ్చరించింది జానకి రాధను. "ఆయనతో గొడవపడకు...." అంటూ-కూతురు తత్వం ఆమెకు బాగా తెలుసు....

రాధకు ఊహ తెలియని రోజుల్లోనే ఆయన తనతో తెగతెంపులు చేసుకున్నారు. రాధకు ఊహ తెలిసిన తరువాత ఏన్నడూ తండ్రిని చూడలేదు. వయస్సు వచ్చి తనకు జరిగిన అన్యాయం తెలుసుకున్న తర్వాత తండ్రిని "నాన్నా" అని పిలవటానికి కూడా మనస్సు ఎదురు తిరిగింది. ఆయన్ని ఎప్పుడూ తన తల్లికి "ఆయన"గానే గుర్తించింది.

తమకు అన్యాయం చేసిన ఆ వ్యక్తిని గౌరవించాల్సిన అవసరం తనకేంవున్నది?

తల్లి మాటలకు తల ఎగరవేసి ఊరుకున్నది రాధ.

జానకి భయం భయంగా కూతురు మొఖంలోకి చూసింది.

ఆ తండ్రికి ఎంత గీర వున్నదో ఈ కూతురికీ అంతే!

ఒకనాడు ఉపయూన తన ప్రపంచమంతా సర్వనాశనమయిపోయింది—

పండక్కి పుట్టింటికి వెళ్ళి, పండుగను ఎంతో సంతోషంతో గడిపి, ఇక రేపో ఎల్లుండో వెళ్దాం అనుకుంటూండగా "అటంబాంబు"లాంటి ఉత్తరం వచ్చింది ఆయన దగ్గరనుండి....

"ఇది నీమీద ద్వేషంతోనూ, నీవంటే అయిష్టతతోనూ చేస్తున్న పనిగాదు....కాని మన జీవితాలల్లో ఇలా జరగాలని యెన్నడో దేవుడు రాసినట్లున్నాడు .... ఇక నీవిక్కడికి రావద్దు .... ఈనాటినుంచి మనం వేరువేరుగా బ్రతుకుదాం....నీకోసరం ఐదువేలు-"

ఎవడిక్కావాలి బోడి ఐదువేలు?

కుప్పలా కూలిపోయింది.

ఇదెక్కడి నిజం?

—అసలు ఆయనకేమైంది?

తండ్రి హడావుడిగా పరుగెత్తాడు ఆయన దగ్గరకు.

ఆయన ఇంటికి వెళ్ళి తలుపు తడితే, ఆయన బదులు మరో స్త్రీ తలుపు తీసింది!...

స్టేషన్లో రైలు ఆగింది.

అప్పుడే ఎండాకాలపు చీకటి వెలాతెలాబోతున్న వెలుగును మింగేస్తోంది. ఏపాపమూ ఎరగని స్త్రీని ఎవరో హత్య చేస్తున్నట్లుగా ఇంజను ఏడుస్తోంది.

ముందు జానకి దిగింది. వెనుకగా రాధ చేతిలో సూట్కేసుతో దిగింది.

"ఇది మరీ చిన్న ఊరిలా వున్నదే!"

రాధ అన్నది.

ఇంతవరకూ గుంటూరు తప్పా మరోవూరు చూడని రాధకు ఈ ప్రయాణం కొత్త అనుభూతిని కలిగిస్తోంది.

అసలు జానకి ఎక్కడికీ బయల్దేరదు— కనీసం ఎండాకాలం శెలవులలో స్కూలు లేనప్పుడు కూడా!

కాని, లలిత పెళ్ళి అంటే తప్పలేదు. తనకు పెళ్ళయి నప్పటినుండి ఆయనద్వారా ఆ కుటుంబంతో ఎంతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. లలిత తండ్రి శుభలేఖ పంపటమే

గాకుండా ప్రత్యేకంగా ఓ ఉత్తరంకూడా రాశాడు. "ఇది నా యింట్లో జరుగుతున్న మొదటిదీ చివరిదీ అయిన శుభకార్యం. మీరు తప్పక రావాలి!" అంటూ.

ఇక బయల్దేరక తప్పలేదు — అందునా స్కూలుకు సెలవలు!

ఆయనకు లలిత ఒక్కగానొక్క కూతురు!

స్టేషన్ బయటకు వచ్చారు తల్లీకూతుళ్ళు.

సూట్కేసు పట్టించుకువద్దామంటే మనిషే కనబడలేదు. అసలు చూస్తే ఆ స్టేషన్లో దిగింది తామిద్దరేనేమో ననిపిస్తోంది.

రాధే సూట్కేసు పట్టుకురాసాగింది!

3

పెళ్ళివారిల్లు పెద్ద పుత్తయిదులా కళ కళ లాడుతోంది. రావాల్సిన చుట్టాలంతా వచ్చినట్లే. ఇక పెళ్ళివారే రాత్రికెప్పుడో దిగాలి.

జానకి ఒకటి రెండుసార్లు ఇల్లంతా పరికించి నలుగురు మగవాళ్ళనూ చాటుగా పరికించి చూచింది—ఆయనగాని వచ్చారేమోనని!

ఎక్కడా కనబడలేదు.

—ఎవరిని అడుగుతుం

రాత్రి పదిగంటలు [illegible] పూర్తి చేసుకొని సుభద్ర లలిత తల్లి - జానకి దగ్గరకు వచ్చి కూర్చున్నది.

రాధ అప్పుడే నిద్రలోకి జారిపోయింది.

సుభద్ర కూర్చుంటూనే, "ఆవిడవచ్చింది!" అన్నది.

జానకికి అర్థంకాలేదు. అదే భావాన్ని ముఖంలో వ్యక్తపరుస్తూ "ఎవరూ?" అన్నది.

సుభద్ర ఇంకాస్త ముందుకు జరిగింది.

"ఆవిడే.... మీ సవతి!"

"ఆయన రాలేదా!" అఘాటుగా జానకి అడిగింది.

"ఊహూఁ...." ఏదో అర్జంటు పని తగిలి ఉండిపోయాడట — ఆమెను పంపాడు!"

"నీకు తెలుసా ఆమె ఇదివరకు!"

"ఆఁ చాలాసార్లు వెళ్ళాం వాళ్ళింటికి.... మంచి మనిషే ఆమె!" నవ్వింది సుభద్ర.

జానకి సుభద్ర ముఖంలోకి ఒక్కసారి చూచి తలవంచుకున్నది.

4

కాఫీ ఇద్దామని రాధకోసం చూస్తే ఎక్కడా కనబడలేదు.

చిత్తు కాగితాలు కొంటానికి వచ్చాడుగానీ-
నువ్వు రాసిన నవల్నిలా పట్రా శాంతా!



జానకి నాలుగు వైపులా తిరిగింది.

దొడ్లో వున్నదేమోనని తొంగిచూస్తే — అక్కడ పున్నాగ పూలచెట్టు క్రింద ఎవరితోనో మాట్లాడుతూ కనబడింది.

"రాధా! కాఫీ త్రాగి వెళ్ళమ్మా!" పిలిచింది!

రాధమ్మ కాఫీ గ్లాసు అందుకుంటుంటే, "ఎవరే ఆవిడ?" అని అడిగింది.

"తెలియదు!"

"ఏమిటి మాట్లాడుతున్నావు, మరి!"

"ఏముంది.... లోకాభిరామాయణం ... పేరూ, ఊరూ, చదివే చదువు...." నవ్వింది రాధ.

సుభద్ర అటువేపు వెళుతున్నదల్లా ఆగి, "జానకీ! రాధకు పెళ్ళెప్పుడు చేస్తావు.... సంబంధాలేమైనా చూస్తున్నావా?.... చెప్పు ఇక్కడే ఎవరినైనా చూశేద్దాం లేకపోతే!" అన్నది.

"ఫో అత్తయ్యా!.... ఇప్పుడే నాకు పెళ్ళేమిటి?" అంది ఎర్రబడ్డ బుగ్గల్ని చేతుల్లో దాచుకో ప్రయత్నిస్తూ.

"ఇప్పుడేం తొందర సుభద్రా!.... మొన్ననేగా దానికి పదహారు వచ్చింది!"

సుభద్రను ఎవరో పిలిస్తే వెళ్ళిపోయింది.

**కబుర్లు**

**కబుర్లు చెప్పాలంటే ఆడవారికే చెప్పాలి. అవతలివారు శ్రద్ధగా వినకపోతే, చెప్పే వారికి ఉత్సాహం వుండదు. ఎంత చెత్తకబుర్లు అయినా ఆడవారు మహా శ్రద్ధగా వినగలరు.**

**— సోమ్స**

పెళ్ళివారికి పంపేందుకు ఉప్మాలు రెడీ అవుతున్నాయి.

ఇంతలోనే సుభద్ర మళ్ళీ వచ్చింది.

"జానకీ! కాస్త నిమ్మకాయలు తరుగుతావా... ఒక్కొక్కటి నాలుగు ముక్కలుచేసి స్టీల్ బేసిన్‌లో పడేశేయ్!" అంటూ వచ్చినంత హడావుడిగా వెళ్ళిపోయింది.

జానకి వంటఇంటివైపుకు వెళ్ళి "శుభ్రంగా స్నానంచేసి, పౌడరు రాసుకో... అలా జిడ్డు కారుతూ తిరగబాకు!" అన్నది కూతురు మొఖంలోకి ఆప్యాయంగా చూస్తూ.

ఒక వయస్సు వచ్చిన తరువాత ఆడపిల్లల మీద శ్రద్ధచూపక తప్పదు!

## 5

రుక్మిణి అంతమందిలోనూ బెరుకు బెరుగ్గా తిరుగుతోంది. తెలిసిన వాళ్ళెవ్వరూ లేరు. తెలిసిన సుభద్ర పెళ్ళిపనులలో నిండా మునిగి పోయి వున్నది.

అటు వచ్చినప్పుడో, ఇటు పోయినప్పుడో రుక్మిణి కనబడ్డప్పుడల్లా ఓ చిరునవ్వు నవ్వి వెళ్ళిపోతోంది సుభద్ర.

రుక్మిణికి రాధ కుదురుగా ముచ్చటగా కనబడింది.

ఆ అమ్మాయిని చూస్తుంటే తనకు తెలిసిన వారినెవరినో చూస్తున్నట్లు అనిపిస్తోంది.

ఆ అమ్మాయి కళ్ళు, ఆ అమ్మాయిముక్కు, నవ్వుతున్నప్పుడు ఆ అమ్మాయి బుగ్గల్లోపడే సొట్టలు, తనకు బాగా తెలిసిన వాళ్ళెవరిదో ఆకారాన్ని పోలివున్నాయి.

అందుకే ఆ అమ్మాయితో పదే పదే మాటలు కలుపుతూ కాలక్షేపం చేయసాగింది. కల్పించుకొని దగ్గరికి పిలిచేది. అవీయివీ అడుగుతుండేది.

ఒకసారి అలా మాట్లాడుతున్న సమయంలో, అటుగా వచ్చిన సుభద్ర వాళ్ళిద్దరినీ చూస్తూనే ఫక్కున నవ్వి, "ఏమిటి పిన్నీకూతుళ్లు యిద్దరూ మాట్లాడుకుంటున్నారు!" అన్నది.

ఇద్దరూ ఒక్క క్షణం అవాక్కయ్యారు.

మరుక్షణంలోనే రుక్మిణికి ఆ అమ్మాయి యెవరో తెలిసిపోయింది.

తెలియనిదల్లా రాధకే!

రాధకు ఆవిడ ఎవరో ఊహకందలేదు. బిక్క మొఖమేసింది.

సుభద్ర రాధభుజం తడుతూ, "ఏమిటిలా తెల్ల మొఖం వేస్తావ్.... మీ పిన్ని!" అంటూనే, "రుక్మిణీ! ఈ హడావుడిలో నీకు చెప్పడమే మర్చిపోయాను.... రాత్రి వచ్చారు, జానకీ, రాధా జానకిని చూపిస్తానుండు!" అంటూ వెళ్ళిపోయింది.

రుక్మిణి రాధ చేయిపట్టుకొని, "రా......... అమ్మా!" అన్నది ఆప్యాయంగా.

రాధకు ఇంకా అర్థం కాలేదు.

ఆమె తనకు ఎలా పిన్నో, అమ్మ అక్కడ వుండీ ఆమెను తనకు ఎందుకు పరిచయం చేయలేదో అర్థమేకాలేదు.

ఇంకా అయోమయంగా చూస్తూనే వున్నది

చటుక్కున ఏదో ఆలోచనరాగా, సూటిగా ఆమె మొఖంలోకిచూస్తూ, "నాన్న వస్తాడేమో అనుకున్నారు అమ్మా తను. ఆయన బదులు ఆమె వచ్చిందిట... ఆమెకాదుగదా ఈమె!" భయం భయంగా చూడసాగింది.

ఒక్కక్షణం తటపటాయించి. కళ్ళు రెప రెప లాడిస్తూ, "మీరు ...!" అంటూ ఆమె మొఖంలోకి సూటిగా చూడసాగింది.

రుక్మిణి తడబడ్డది.

ఆమెకు ఎలా చెప్పాలో అర్థంకాలేదు.

"నేను... నేను..." నానుస్తూ తడబడు తున్నట్లుగా. మరుక్షణంలోనే చిన్నగానవ్వి, "మీ నాన్నకు రెండో భార్యను!" అన్నది.

"ఆయన ఎందుకు రాలేదు!" సూటిగానే అడిగింది రాధ.

"ఏవో ఆఫీసు పనులొచ్చి ఆగిపోయారు.... నేనొక్కదాన్నే వచ్చాను!" అన్నది రుక్మిణి.

అంతవరకూ ఆప్యాయంగా తనను మాటి మాటికి పలకరిస్తున్న ఆమె 'ఆమె' అని తెలుసుకునేటప్పటికల్లా శరీరమంతటా తెలియని వేడి బయల్దేరింది.

తమ జీవితంలో నిప్పులుపోసి. తమను తన తండ్రికి దూరంచేసిన ఆమెను అంతకుముందు వరకూ చూసినంత సాత్వికంగా చూడలేక పోతోంది—ముళ్ళమీద నిల్చున్నట్లుగా ఫీలవుతూ, అక్కడినుండి ఎంత తొందరగా వెళ్ళి పోదామా అని అనుకోసాగింది.

కాని రుక్మిణి పరిస్థితివేరు—అంతవరకూ ఎక్కడో చూసినట్లుగాను, చాలా పరిచయ మున్నట్లుగానూ వున్న ఆ అమ్మాయి ఎవరో తెలిసినప్పటినుండీ రాధమీద తెలియని ఆత్మీయత మనస్సంతా ఆవరించింది.

అందుకే, చేయి జాపుతూ, "రా అమ్మా!" అన్నది.

రుక్మిణికి రాధను చూస్తుంటే మనస్సంతా నిండుగా వున్నది. ఏదో, ఎక్కడో పోయిన పెన్నిధి ఆ క్షణంలో దొరికినంత ఆనందంగా వున్నది.

రాధ ఆమె కోరినట్లుగా ఊరుకోలేక పోయింది. ఏదో పని వున్నదానిలా అక్కడి నుండి వచ్చేసింది.

స్టోర్ రూం దగ్గర వున్న తల్లిని చూస్తూనే "అమ్మా! ఇందాక నాతో మాట్లాడుతూన్నది ఎవరూ అని అడిగాపు చూడు- ఆమె, "ఆమే నమ్మా!" అన్నది.

"ఆమె అంటే!" తల్లి నవ్వింది కూతురు మాటలకు.

"అదే మీ ఆయన రెండో భార్య!"

జానకి కూతురు మొఖంలోకి చూస్తూ అలాగే వుండిపోయింది!

## 6

"రాధా! ఇలా రా....! అన్నది రుక్మిణి అప్పుడే స్నానంచేసి గుడ్డలు మార్చుకున్న రాధను చూస్తూనే.

రాధ దగ్గరికల్లా వచ్చి, "ఎందుకన్నట్లుగా" ఆమె ముఖంలోకి చూచింది.

"లోపలికి రా!'

అనుమానిస్తూనే లోపలికి వెళ్ళింది రాధ.

ఆ గదంతా పెళ్ళికి వచ్చిన వాళ్ళ పెట్టెలతో నిండివున్నది. రుక్మిణి ఓ లెదర్ సూట్కేసు దగ్గర కూర్చుని, వంగొని, మంగళ సూత్రానికి కట్టుకున్న తాళంచెవితో,

తాళం తీసి. పెట్టె మూత తీస్తూ, "చూడు రాధా!" అన్నది.

రాధ ఆమె ముఖంలోకి విచిత్రంగా చూస్తూ కూర్చున్నది.

"ఇదుగో... ఇది మెళ్లో వేసుకో... నలుగురిలో బాగుంటుంది!" అన్నది ఓ రాళ్ళనెక్లెస్ తీసి రాధకిస్తూ.

"వద్దండీ! ఎందుకు.... మెళ్లో ఓ గొలుసు ఉన్నా గూడా!" అన్నది లేచి నిల్చుంటూ.

"పెద్దదాన్ని చెబుతున్నాను విను!.... ఒంటిపేట గొలుసెందుకు .... పెళ్ళిలో ఇది వేసుకో!"

"వద్దండీ! వద్దు!"

అంత నిర్మొహమాటంగా చెబుతున్న రాధ మాటలకు ఆమె క్షణం మాట్లాడలేకపోయింది.

"మీ నాన్న రాలేదు వస్తే ఆయన మాటనూ నా మాటంత తేలిగ్గా తీసివెయ్యగలిగేదానివా?" అన్నది గొణుగుతున్నట్లుగా.

ఆమె అంటున్నది గూడా వినిపించుకోకుండానే, ఏదో భయంకరమైన ప్రదేశంనుండి బయటపడాలన్నట్లుగా పరుగెత్తబోయింది. కాని, రుక్మిణి వదల్లేదు. చేయి పట్టుకొని ఆపింది. తనూ లేచి నిల్చుంటూ "ఈ ఒక్క రోజూ నేను చెప్పినట్లు విను .... నీ అమ్మ నీకెంత దగ్గిరదో .... నేను నీ అమ్మను కాక పోయినా, కాలేకపోయినా - నీ నాన్న ద్వారానైనా-నన్నూ దగ్గరదానిగా భావించుకో!" గాఢంగా నిట్టూర్పు విడిచింది.

రాధకు ఏంచేయాలో, ఏమనాలో తెలియ లేదు.

"అమ్మ ఏమంటుందో" అనే భయం మనస్సును పీక్కుతింటోంది. అంతేగాదు, బలవంతాన ఆమె తగిలించిన ఆ విలువైన వస్తువు తన మెడకు చాలా బరువుగా వున్నది.

రాధ ఆ గదిలోనుంచి బయటకు వచ్చేంది.

రుక్మిణి వెళుతున్న రాధను కన్నార్పకుండా అలా చూస్తూనే వున్నది.

ఆమె కళ్ళల్లో నీళ్ళుగిర్రున తిరిగినాయి.

ఆమె విచలిత అయింది.

ఆమె ఆ తడి కళ్ళతోనే-తనముందు జీవితంలో ఓ మెరుపును చూడుకున్నది!

## 7

"రాధా! అది మనకు వద్దు.... ఇచ్చేసిరా.... నీకు తెలియదు!" అన్నది ఒత్తి పలుకుతూ జానకి.

రాధ పరిస్థితి వాళ్ళదరి నడుమా గట్టునపత్త చేపస్థితి అయింది—ఇదెక్కడి గొడవ తనకు?

"నేను కావాలని తెచ్చుకోలేదమ్మా!.... మొండిగా ఆమే దీనిని నా మెడకు తగిలించింది... పోనీయ్.. ఆమె కోరికను మాత్రం ఎందుకు తీర్చగూడదు.... ఓ గంట పెట్టుకొని యిచ్చేస్తేసరి!"

"నేనెక్కువా.... ఆమె ఎక్కువా. నీకు?

"నీ ప్రశ్నకు నా సమాధానం ఒకనాడేగాదు, ఏనాటికైనా ఒక్కటే... నిన్ను మించిన వాళ్ళు నాకు మరొకరు లేరమ్మా ఈ ప్రపంచంలో!.... కానీ దానికీ దీనికీ ముడిపెట్టటం దేనికి?"

జానకి గర్వంగా ఒక్కక్షణం కూతురు ముఖంలోకి చూచింది. మరుక్షణంలోనే కళ్ళకు మరింత తీక్షణతను పులుముకుంటూ, "అయితే మంచో చెడో నేను చెప్పినపని ఎందుకు చేయవు?" అన్నది.

"గొలుసు ఇచ్చి రమ్మంటివి, అంతేనా?"


ప్రెగ్నిటోన్ ప్రసవించేవరకు ఉపయోగం.
•ప్రథమ మాసముల వేవిళ్లు,
• మధ్యమాసముల నీరుచూపుట,
•తర్వాతమాసముల గర్భపాతములు,
•అకాల ప్రసవము నివారించును.
బేబిక్స్ లివర్ డ్రాప్స్ 1942 స్థాపితం
•లివరు, అనాస వ్యాధులు నివారించి బలము నిచ్చును.
తయారు: ఔషధి ఫార్మస్యూటికల్స్ • గుడివాడ.
* అన్ని మందుల షాపులలో దొరకును.

క్షణం ఏహ్యంగా కూతురు మొఖంలోకి చూచింది, "డబ్బు మనుష్యులను కొనేయగల దని నిరూపిస్తున్నావు రాధా!.... నీవు చిన్న పిల్లవుగాదు...అయినా నీవూ సొమ్ములకు దాసోహం అటున్నావు అంటే...."

సుభద్ర లోపలికివస్తూ, "జానకీ! కాస్త టిఫెన్లు గిన్నెల్లోకి సర్దితే ... విడిదికి పంపిం చేయవచ్చు...నీవుకాస్త నడుం కట్టుకోకపోతే ఎక్కడిపనులు అక్కడే వుండిపోతయి!" అన్నది.

జానకి కూతురి మొఖాన్ని, కూతురు మెడ లోని రాళ్ళ నెక్లెస్‌ని ఒక్కసారి భయంగా చూచి సుభద్ర ననుసరించింది.

రెండడుగులు వేసింతరువాత, "సుభద్రా! మా సవితికి ఎంతమంది పిల్లలు?" అడిగింది కుతూహలంగా.

"లేరు!"

"అప్పలా!"

"ఇక పుటరని కూడాగాబోలు చెప్పినట్లు గుర్తు..అదేదో డాక్టర్లు అన్నారని అన్నది!"

సుభద్ర మాటలు వింటూనే జానకికి తన అడుగులు ఏదైనా అగాధంలో పడుతున్నయ్యా అనే భయం పుట్టసాగింది మనస్సులో....

గుండె గుబ గుబ లాడసాగింది.

రాధను తననుండి—

ఇక ఆలోచించలేకపోయింది

## 8

రాధ బయటకు వెళ్ళబోతుంటే జానకి అడ్డు పడింది.

"ఎక్కడికే వెళుతున్నావు?"

తల్లి ముఖంలోకి విచిత్రంగా చూచింది రాధ.

ఇక్కడకు వచ్చినప్పటినుండీ ఆమె ప్రవ ర్తన వింతగా వున్నది.

"కూర్చో రాధా గదిలో .... ఎండ ఎట్లా మండిపోతున్నదో చూచావా?"

బయటకు వెళ్ళి రుక్మిణితో ఎక్కడ మాటల్లో పడిపోతుందోనని ఆమె బాధఅంతా.

అందునా—సుభద్ర, రుక్మిణికి పిల్లలు లేరని, ఇక పుట్టరని చెప్పినప్పటినుండి ఆమె మనస్సు మనస్సులో లేదు. అంతేగాదు, ఎన్నడూ బయటకుకదలని తను ఈనాడు సతు గురిలోకి ఈ వివాహానికి ఎందుకువచ్చానా అని కొద్దిక్షణాలు విచారించకనూ పోలేదు.

రాధ లేకుండా తనెలా బ్రతకగలదు?

అసలు ఆ రోజుల్ని ఎలా వూహించుకో గలదు తను?

ఆమెకు దిగులు పుట్టింది. వేదన పుట్టింది. దుఃఖం వచ్చింది.

తన జీవితంలో నిప్పులుపోసిన ఆయన గుర్తుకువచ్చాడు. అలా నిప్పులు పోయటానికి కారకురాలయిన ఆమె గుర్తుకువచ్చింది.

ఆమె గుండె బరువెక్కింది.

ఆమె శూన్యంలోకి చూస్తున్నట్లుగా అలాగే వుండిపోయింది.

దేవుడా నన్ను రక్షించు!

నా రాధను నానుండి దూరం చేయబోకు!

## 9

తెల్లవారు ఝామున మెళకువ వచ్చి పక్కకు చూస్తే రాధ కనబడలేదు. దూరంగా రాత్రి తన సవితి పడుకున్న వైపుకు చూస్తే ఆమే కనబడలేదు.

భయంతో అధాట్టుగా లేచికూర్చున్నది.

"వీళ్ళిద్దరూ ఎక్కడకు వెళ్లారు?


సెక్సు హాస్పటల్



దురభ్యాసాలకు లోనై దాంపత్య సౌఖ్యం అనుభవించ లేనివారు వెంటనే సంప్రతించండి!

డా॥ A. పూర్ణచంద్రరావు

(సెక్సు స్పెషలిస్టు) N.D.F.N.F.U(CEYLON) R.A.M.P

గవర్నరుపేట, మ్యూజియంరోడ్, విజయవాడ-2 (A.P)

సెక్సు సుఖవ్యాధులకు ప్రత్యేక చికిత్స కలదు.

కలవరపడసాగింది.

ఏదైనా ఆశచూపించి రాధనుగాని తనతో తీసుకొని వెళ్ళిపోలేదు గదా ఆమె!

దబదబ లేచి వాకిట్లోకి వచ్చింది. పున్నాగ పూలచెట్టుక్రింద చూచింది. దొడ్లో బావిదగ్గ రకు వచ్చింది.

అక్కడ రాధ మొఖం కడుక్కుంటూ కన బడేటప్పటికి ప్రాణం లేచి వచ్చింది.

"ఏంవే! అంత పొద్దున్నే లేచావ్!"

"తోటకెళ్దామని!"

"ఏ తోట?"

"మామిడితోట!"

"ఎక్కడున్నది?"

"దగ్గరేట గదా?"

"ఎవరెవరు వెళతున్నారు?"

"నేనూ ఆవిడా!"

"అంటే...."

"అదే మీ వసతి!"

జానకి ముందుకో అడుగువేసింది. "ఆమెతో నీకేంపని?" తీక్షణంగా అడిగింది.

రాధ నవ్వింది: "ఎచ్చి అమ్మా! ఆమె అంటే నీకెందుకంత భయం?.... ఇక్కడ ఏమీ తోచడంలేదు.... అలా వెళ్దాం వస్తావా అన్నది- వెళ్ళటంలో తప్పేంవున్నది.... కాస్సేపు తిరిగివస్తాను!"

"అవునే.... తప్పేంవున్నది.... వెళ్తావ్... వెళ్ళు ... ఇవాళ తోటకు రమ్మంటుంది.... సాయంత్రం తనతో తన ఊరికి రమ్మంటుంది.

"సాయింత్రందాకా ఎందుకు? - రాత్రే అన్నదామాట .... వాళ్ళ కారులో హైద్రాబా దంతా చూపిస్తానన్నది!"

జానకి అవాక్కయి అలాగే కూతురు మొఖంలోకి చూస్తూ వుండిపోయింది.

ఆమె స్మృతిహీన అవుతున్నది.

"నీవేంవన్నావ్?" నీరసంగా అడిగింది.

—తనకు తెలుసు తన ప్రపంచం సర్వ నాశనమవబోతున్నది!

రాధ జాలిగా తల్లి మొఖంలోకి చూసింది, "రానన్నాను .... నాకా కార్లు అక్కరేద న్నాను....నాకా మేడలు అక్కర్లేదన్నాను... నాకా బంగారు నగలు అక్కర్లేదన్నాను .... అంతేగాదు, అవన్నీ నాకు మా అమ్మే అన్నాను....ఆమెను వదలి ఒక్కక్షణంకూడా ఎక్కడికీ రానన్నాను!" అంటూనే పెద్దగా నవ్వేసి "అదుగో ఆవిడ వచ్చేస్తోంది... తోట లోకి వెళ్ళి ఇట్టే వచ్చేస్తాం...." పరుగెత్తు తున్నట్లుగా గుడ్డలు మార్చుకునేటందుకు వెళ్ళిపోయింది.

## 10

సాయంత్రపు సూర్యుడు ఎవ్వరిమీదో కినుక వహించినట్లుగా ఎర్రబడి పోయాడు. మధ్యాహ్నమయ్యేటప్పటికి వచ్చిన చుట్టాల్లో మూడొంతులమంది వెళ్ళిపోయారు.

ఆరోజు ఉదయాన ఎవరూ లేకుండాచూచి, జానకి ఒంటరిగా వున్న సమయంలో రుక్మిణివచ్చి దగ్గిర కూర్చొన్నది.

"అక్కయ్యా! జీవితంలో నేను తెలిసో తెలి యకో నీకు అన్యాయం చేశాను....ఇది నావల్ల జరిగిన తప్పుకాదు అన్నా నీవు నమ్మవు.... నీవేగాదు ని స్థానంలోవున్న ఎవ్వరూ నమ్మ లేరు. ఇప్పుడా పాత గాధలన్నీ ఎందుకు?.... గతం గుర్తుకు తెచ్చుకోవటంలో మనకు లభించే దేంవున్నది? — లేకపోగా మనస్తా పంతో మరింత కృంగిపోవటం తప్ప!"

"ఎందుకిదంతా?" మనస్సంతా దిగుళ్ళ గూళ్ళతో నిండిపో సాగింది జానకి.

రాధకు దూరమయి తను బ్రతకలేదు!

మౌనంగా కొయ్యబొమ్మలా రుక్మిణి మొఖంలోకి చూస్తూ వుండిపోయింది.

"నాకు తోడబుట్టిన అక్కయ్యలెవరూ లేరు ....అంతేగాదునాకు ఎవరూ లేరు....నాకు అమ్మ లేదు....నాకు నాన్నలేడు....అందరినీ నీలో నే చూసుకుంటానమ్మా .... నా కోరిక తీర్చ వమ్మా... ఆయనున్న మీ యింటికి పంపుతాను త్వరలోనే...."

## 11

రైలు కూతకు ఉలిక్కిపడింది జానకి. "ఉంటానక్కయ్యా!"

"వస్తా....వస్తా ..." తడబడింది.

రైలు పరుగునందుకుంటోంది జానకి జీవితంలో వెనకబడిపోయిన జానకిని మోసుకు వెళుతున్న రైలు ముందుకు దూసుకుపోతోంది.

రైలు అవుటర్ సిగ్నల్ దాటుతున్న సమయంలో, అప్పటివరకూ బిగబట్టుకున్న కోపాన్ని కూతురుమీద వెళ్ళగక్కింది జానకి.

"ఏమంటుందే ఆవిడ?"

"ఆయన్ని పంపుతుందట .... మళ్ళీ.... కనీసం నన్ను నాన్నా వాళ్ళవూరు రమ్మన్నది!"

"నీవేమన్నావ్?"

"ఏమంటాను .... పంపమన్నాను....వస్తానన్నాను!"

— ఈ రైలు పట్టాలుతప్పికూలిపోతే ఎంత బాగుంటుంది?

## 12

ఉదయపు నీరెండ హాయిగా వున్నది.

వాళ్ళకు కోపమొచ్చినా పెళ్ళికి వెళ్ళకుండా వుంటే ఎంత బాగుండేది?

సరిగ్గా జానకికి రాత్రిళ్లు నిద్రపట్టి నాలుగు రోజులయింది.

ఏ క్షణాన ఆయన తలుపులు తోసుకుంటూ లోపలకు వస్తాడో? అలా వచ్చి రాధనుతీసుకు వెళతానంటే తను చేయగలిగిందేమున్నది?

తనకింకా దిక్కెవరు?

అయినా రాద....రాధ కూడా ఎందుకలా మారిపోయింది?

కార్లమీద మోజా? సొమ్ములకోసం తహ తహ తండ్రంటే మొఖం వాచా?....

గుండెల్లో బరువుగా వున్నది.

తలుపు తటిన శబ్దమయితే రాధ వెళ్ళి తలుపు తీసింది.

ఎవరో కొత్తాయన, చిన్నగా నవ్వుతూ "నువ్వు రాధవేనా? మీ అమ్మ జానకేనా? అయితే నేను...."

## 13

"రండి నాన్నా!"

కుర్చీ తెచ్చి వేసింది. లోపలకు పరుగెత్తుకు వెళ్ళి కాళ్ళకు నీళ్ళుతెచ్చి ఇచ్చింది.

తండ్రిని చూచి రాధపడుతున్న ఆనందాన్ని ఉత్సాహాన్ని వెర్రిగా చూడసాగింది జానకి.

"రాధా!" గొణుగుతున్నట్లుగా పిలిచింది.


# శుభ వార్త

డాక్టర్లకు సాధ్యం గాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులు బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొల్లి, కేన్సర్ సంతానము లేనివారు కూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవల్ల సంపూర్ణ ఫలము బడయగలరు. ఈ చికిత్స వలన దేహములోని వ్యాధులు తొలగిపోవుటయే గాక, నూతన యౌవనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రెండు రూపాయలు పంపవలయును.

శ్రీ యోగాశ్రమము

పెదవాల్తేరు,

విశాఖపట్టణము–3.

"నాన్న వచ్చాడమ్మా!" చిన్నపిల్లలా అన్నది రాధ.

జానకికి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

"జానకీ!" పిలిచాడు ఆయన. "నిన్ను చూచి చాలా రోజులయింది జానకీ .... ఒక్కసారి ఇలా రా!"

జానకి మాట్లాడలేదు, మాట్లాడాలనిపించలేదు. బిగుసుకుపోయి అలాగే నిల్చుండిపోయింది. కొయ్యబొమ్మ అయింది.

ఆమె కళ్ళకు నల్లటి తెరలు అడ్డుపడుతున్నాయి. ఆమె ముందు జీవితం మీద గత జీవితపు నల్లటి మబ్బులు ముద్దముద్దగా పడుతున్నాయి.

తన సర్వనాశనానికే వచ్చిందీరోజు....

"ఎందుకు వచ్చారో తెలుసుకోవచ్చా?"

తడబడ్డాడు ఆయన. ఏం చెప్పాలో తెలియనట్లుగా అయోమయంగా చూడసాగాడు.

"చెప్పండి!" రెట్టించింది ఆలస్యం భరించలేనట్లుగా.

"మిమ్మల్ని చూద్దామని!"

"మిమ్మల్ని-అంటే ?"

"నిన్ను. రాధని !"

ఆమెకు గుండె భయంతో చిక్కబట్టుకున్నట్లయింది.

"మాకు మీరేమౌతారని ?"

ఆయన మొఖంమీద ఎవరో మసిపూసినట్లుగా నల్లబడిపోయింది. "నీకు తెలియదా?.. పోనీ రాధ వాకిట్లో వున్న నన్ను ఏమని పిలిచిందో వినలేదా?" అన్నాడు కష్టంగా ఆయన.

రాధ బయటకు వచ్చింది.

"అమ్మ మనస్సు ఎంతగా గాయపడిందో తెలిస్తే ఆమె మాటలకు అంతగా కష్టపెట్టుకోరు నాన్నా!" అంది.

జానకి మొఖంమీదకు చెంగును లాక్కొని ఆ గడప అవతలే కూలబడిపోయింది.

తండ్రీ కూతురూ ఒక్కటయితే ఇక తన బ్రతుకేమిటి ?

"నాకు తెలుసు రాధా! రుక్మిణి ఎంత చెప్పినా నేను నమ్మలేదు........అయినా రాధ వస్తానన్నది, వెళ్ళి తీసుకు రమ్మనమని నా ప్రాణం తీసింది....అందుకే వచ్చాను......

జానకికి, నీకూ నేను చేసిన అన్యాయం నాకు తెలుసు తల్లీ!"

రాధ ఒక్కక్షణం ఆగింది. తండ్రి మొఖంలోకే తదేకంగా చూస్తూ, "జీవితంలో మా నాన్నను నేను ఒక్కసారి చూడాలి అనే నాలోని బలమైన కోరికే మిమ్మల్ని ఇక్కడకు రప్పించేలా చేసింది....అందుకే మిమ్మల్ని రమ్మనమన్నాను....ఇక నేను అక్కడకు రావటమంటారా? అది జరగనిపని....అమ్మకు నేనుతప్ప ఎవ్వరూ లేరు ........ అటువంటి అమ్మకు దూరమయి — చిన్నప్పటినుండీ అమ్మా నాన్నా రెండూ తనే అయి పెంచిన ఆమెను కష్టపెట్టటం, బాధించటం నా కిష్టం లేదు...మీరు వస్తారూ, నన్ను తీసుకు వెళ్తారూ అనే భయంతో ఆమె నాలుగు రోజులబట్టీ తిండికూడా సరిగ్గా తినటంలేదు... కంటికి నిండుగా నిద్రయినా పోవటంలేదు తెలుసా!" అన్నది.

"రాధా....!"

"అవును నాన్నా! మీరుగాని, ఆవిడగాని నన్ను ఎన్నిసార్లు చూడాలని అనుకున్నా ఈ యింటి తలుపులు ఎప్పుడూ తెరిచేవుంటాయి.... అంతేగాని, మీ యింటికి నన్ను రమ్మనమని కోరవద్దు....అలా నేను వస్తానని ఆశించవద్దు!" ఆ కంఠంలోని దృఢత్వం ఆయన్ను వివశుణ్ణి చేసింది.

## 14

అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించాడు.

★

